# మరింత దిగువకు!

**మా**ర్కెట్ వరుసగా రెండో వారమూ క్షీణపథంలోనే సాగింది. విదేశీ మదుపర్ల విక్రయాలు కొనసాగడం, బలహీన అంతర్జాతీయ పరిణామాలు ఇందుకు కారణం. ఈజిప్టు ఆందోళనలు మధ్యప్రాచ్య దేశాలకు పాకుతాయన్న భయాల నడుమ గతవారం ట్రేడింగ్ బలహీనంగా ప్రారంభమైంది. మంగళవారానికి మరింత దిగజారింది. ఈదిశలో దిగువ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఆహార ద్రవ్యోల్బణం పెరిగినా మార్కెట్ పెద్దగా పట్టించుకోలేదు. అయితే విదేశీ మదుపర్ల విక్రయ ఒత్తిళ్లు, ఈజిప్టు గొడవలు, పెరిగిన ముడి చమురు ధరలు వారాంతానికి సెన్సెక్స్‌ను 17927 పాయింట్ల కనిష్ఠ స్థాయికి చేర్చాయి. చివరకు మార్కెట్ 388 పాయింట్లు నష్టంతో 18008 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల తీరు:** వరుసగా నాలుగో వారమూ విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) రూ.1,303 కోట్ల నికర అమ్మకాలు జరపడం గమనార్హం. ఫండ్లు మాత్రం రూ.249 కోట్లు నికర కొనుగోళ్లు చేశాయి.

**రంగాల వారీగా:** ముడి వస్తువుల ధరలు పెరగడం మార్జిన్లపై ప్రభావం చూపుతుందన్న అంచనాల మధ్య ఎఫ్ఎమ్‌సీజీ రంగం అత్యధికంగా నష్టపోయింది. స్థిరాస్తి షేర్లు మరోవారం బలహీనతలను చవిచూడగా.. ఇటీవల పెరిగిన ఐటీ షేర్లు దిద్దుబాటుకు లోనయ్యాయి. అంతర్జాతీయంగా లోహ, ముడి చమురు ధరలు పెరగడంతో ఈ రంగ సూచీలు కొనుగోలుదార్లను ఆకర్షించాయి. యంత్ర పరికరాల విభాగమూ రాణించింది.

షేర్ల లాభ నష్టాల నిష్పత్తి 2:5గా ఉంది. క్షీణించిన షేర్లు ఎక్కువగా ఉండడమేగాక త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో కొనుగోళ్లు జరిగాయని దీన్నిబట్టి అర్థమవుతోంది.

**ఈ వారంపై అంచనాలు:** సెన్సెక్స్ తన కీలక స్థాయి 18,000పాయింట్ల కంటే దిగువకు రావడం.. స్వల్పకాలంలో మరింత బలహీనతలకు లోనయ్యే అవకాశాలను సూచిస్తోంది. 18740 కంటే ఎగువన ముగిస్తేనే మార్కెట్ రికవరీ దిశగా పయనించొచ్చు. అంత వరకూ ఎలాంటి రికవరీ వచ్చినా అది కొనసాగకపోవచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** యూరియా నియంత్రణ ఎత్తివేతపై జరగబోయే కార్యదర్శుల కమిటీ సమావేశ పరిణామాలను మార్కెట్ సునిశితంగా పరిశీలించే అవకాశం ఉంది. 10న వచ్చే ఆహార ద్రవ్యోల్బణం గణాంకాలు, 11న విడుదలయ్యే ఐఐపీ గణాంకాలు అత్యధిక ప్రభావం చూపనున్నాయి. ఇక అంతర్జాతీయంగా ఈజిప్టు పరిణామాలనూ పరిశీలించాల్సి ఉంటుంది.




**తక్షణ నిరోధం:** 18235, 18542, 18740 **తక్షణ మద్దతు:** 17820, 17461, 17276

**మార్కెట్ గట్టి మద్దతు లభించే ముందు మరింత క్షీణతకే ఆస్కారం ఎక్కువగా ఉంది.**

*–సతీశ్ కంతేటి, జెన్ మనీ*